జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం | 7 | సెప్టెంబర్ | 2026 • పేజీలు : 8



# బాలికల కళాశాలలో ఆర్ ఓ ప్లాంట్ ప్రారంభం

- అదనపు తరగతి గదులు, సోలార్ విద్యుత్ ఏర్పాటుకు ఎమ్మెల్యే హామీ



**దమ్మపేట, సెప్టెంబరు 6(ప్రజా జ్యోతి):** అంకంపాలెంలోని టీ జీటీడబ్ల్యుఆర్ డీసీ బాలికల కళాశాలలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ సహకారంతో ఏర్పాటు చేసిన ఆర్ ఓ ప్లాంట్ ను ఎమ్మెల్యే జారె ప్రారంభించారు. 1000 రోజుల ప్రజాపాలన వేడుకల్లో భాగంగా శనివారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థినులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడి కళాశాలలో నెలకొన్న సమస్యలు, వారికి అవసరమైన

మిగతా 2 లో...




# అశ్వారావుపేట నియోజకవర్గానికి మహర్దశ!

- దమ్మపేట–అశ్వారావు పేట పంట పొలాలకు గోదావరి జలాలు తెచ్చే బాధ్యత నాది
- ఆయిల్‌పామ్ సాగును 70 లక్షల ఎకరాలకు విస్తరించాలి
- వంట నూనెల దిగుమతుల కోసం ఏటా రూ.2 లక్షల కోట్లు ఖర్చు
- 18న హైదరాబాద్‌లో దక్షిణ భారత వ్యవసాయ మంత్రుల సదస్సు
- కేంద్రంపై ఒత్తిడి తెచ్చేలా కార్యాచరణ: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- రైతు సంక్షేమానికి మంత్రి తుమ్మల కృషి అభినందనీయం --- ఎమ్మెల్యే జారె

**దమ్మపేట/అశ్వారావుపేట, సెప్టెంబరు 6 (ప్రజాజ్యోతి):** ఆయిల్‌పామ్ సాగుతో దేశానికి వంట నూనెల విషయంలో స్వయం సమృద్ధి సాధించడంతో పాటు రైతులకు అధిక ఆదాయం అందేలా సాగు విస్తరణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాల్సిన అవసరం ఉందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. అశ్వారావుపేట ప్రాంత అభివృద్ధికి తన వంతు కృషి ఎప్పటికీ కొనసాగుతుందని, దమ్మపేట, అశ్వారావుపేట మండలాల్లోని పంట పొలాలకు గోదావరి జలాలను అందించే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో అశ్వారావుపేట నియోజకవర్గానికి మహర్దశ తీసుకువచ్చేలా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. అశ్వారావుపేట పర్యటనలో భాగంగా నారంవారిగూడెంలోని తెలంగాణ ఆయిల్ ఫెడ్ రీజినల్ కార్యాలయం, ఆయిల్‌పామ్ మొక్కల తయారీ నర్సరీని మంత్రి తుమ్మల స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణతో

మిగతా 2 లో...

# వచ్చే ఏడాది జూన్_ జూలైలో జరిగే పుష్కరాలకు రాములోరి భక్తులకు సకల సౌకర్యాలు



- భక్తుల కోసం రూ 1.50 కోట్ల వ్యయంతో డార్మెంటరీ నిర్మాణం
- నిర్మాణం పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే తెల్ల వెంకట రావు
- ప్రభుత్వం ఆలయ అభివృద్ధి కోసం కల్పిస్తున్న పనులన్నీ సకాలంలో పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ అంకిత్

**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 6 ,(ప్రజా జ్యోతి)** వచ్చే ఏడాది 2027 జూన్ – జులై నెలలో నిర్వహించే గోదావరి పుష్కరాలకు భద్రాచలం వచ్చే భక్తుల కోసం డార్మెంటరీ హాల్ నిర్మాణాన్ని ఏర్పాటు చేస్తున్నామని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు తెలిపారు. గోదావరి పుష్కరాల కోసం భద్రాద్రి జిల్లాలోని దక్షిణ అయోధ్యగా పేరు ప్రఖ్యాతలు గడిచిన భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంకు వచ్చే భక్తుల కోసం ఈ డార్మెటరీ హాల్ నిర్మిస్తున్నట్లు తెలిపారు.అందులో భాగంగా భద్రాచలంలోని అమ్మ సత్రం ప్రాంతం

మిగతా 2 లో...

# ఇల్లందు భవిష్యత్తుకు ఎలాంటి డోకా లేదు

- పూసపల్లి ప్రాజెక్టు ప్రారంభానికి తొలగిన ఆటంకాలు : ఎమ్మెల్యే కోరం

2 లో...



## టీటీడబ్ల్యూజేఏ జిల్లా అధ్యక్షుడిగా

# మాళోత్ అశోక్



- ప్రధాన కార్యదర్శిగా భూక్య రాము.. ఏకగ్రీవంగా నూతన కమిటీ ఎన్నిక
- జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల సాధనకు ప్రాధాన్యం
- నూతన కమిటీకి ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, జర్నలిస్టు సంఘాల నేతల అభినందనలు
- జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తా: మాళోత్ అశోక్
- జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వంతో చర్చిస్తా: కూనంనేని సాంబశివరావు
- జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా: మాళోత్ రాందాస్ నాయక్
- హక్కుల సాధన కోసం జర్నలిస్టులు ఐక్యంగా పోరాడాలి: మూడ్ గణేష్
- గిరిజన హక్కుల సాధనకు జర్నలిస్టులు కృషి చేయాలి: సాబీర్ పాషా
- సమాజాభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర కీలకం: బానోత్ లాల్ సింగ్
- హక్కుల కోసం పోరాటాలకు సిద్ధంగా ఉండాలి: యోగినంద, రవినాయక్
- జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలి: బి.వెంకటరత్నం
- ఐకమత్యమే జర్నలిస్టుల మహాబలం: కల్లోజి శ్రీనివాస్

8 లో..

## వచ్చే ఏడాది జూన్_జూలైలో జరిగే పుష్కరాలకు రాములోరి భక్తులకు సకల సౌకర్యాలు



(మొదటి పేజీ తరువాయి...)

వద్ద దేవాదాయ – ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో రూ 1.50 కోట్ల వ్యయంతో "డార్మెంటరీ జి ప్లస్ వన్ భవన్ " నిర్మాణానికి ఆదివారం భూమి పూజ కార్యక్రమాలను నిర్వహించగా ముఖ్యఅతిథిగా భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పాల్గొని మాట్లాడారు. గోదావరి పరివాహక ప్రాంతాలలో నిర్వహించే గోదావరి పుష్కరాలకు భక్తులు హాజరవుతారని, ముఖ్యంగా భద్రాచలం పుణ్యక్షేత్రానికి దేశ నలుమూలల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు హాజరుకానున్నారని తెలిపారు. భక్తులకు కనీస వసతులను కల్పించే ఉద్దేశం లో భాగంగా వారి వసతి కొరకు దేవాదాయ శాఖ తరపున ఈ డార్మెటరీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. పది రోజులకు ఒకసారి అధికారులతో సమీక్ష సమావేశం ఈ పుష్కర పనులపై నిర్వహిస్తామని అధికారులు ఇది గమనించి పనిచేయాలని తెలిపారు. ఘాట్ నిర్మాణాలను ఇరిగేషన్ శాఖ అధికారులు, త్రాగునీటి సరఫరా ను ఆర్.డబ్ల్యూ.ఎస్ శాఖ అధికారులు, రోడ్డు పనులను ఆర్ అండ్ బి శాఖ అధికారులు నిర్వహించి ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షించాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అనంతరం భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ.. 12 సంవత్సరాలకు ఒకసారి వచ్చే గోదావరి పుష్కరాలను తెలంగాణ రాష్ట్రప్రభుత్వం గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తుందని, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలవకుండా సౌకర్యాలు కల్పిస్తుందని తెలిపారు. గోదావరి పరివాహక ప్రాంతాలలో ప్రారంభించిన ఘాట్ నిర్మాణాలతో పాటు డార్మెంటరీ నిర్మాణాలను సకాలంలో త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఏడు జిల్లాలో గోదావరి పుష్కర పనులు కొనసాగుతున్నాయని, ముఖ్యంగా భద్రాచలంలో జరుగుతున్న పనులు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ వేగంగా సకాలంలో పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఈ.ఓ దామోదర్, సర్పంచ్ పూనం కృష్ణ, ఉప సర్పంచ్ రత్నం కవిత,వార్డు సభ్యులు రమణ,కారం దుర్గారావు,వాణి పాల్గొన్నారు.

## బాలికల కళాశాలలో ఆర్ ఓ ప్లాంట్ ప్రారంభం



(మొదటి పేజీ తరువాయి...)

సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యార్థినులకు అవసరమైన సామగ్రిని అందజేసి వారితో కలిసి భోజనం చేశారు.రాష్ట్ర, విశ్వవిద్యాలయ స్థాయి క్రీడా పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థినులను ఎమ్మెల్యే అభినందించారు.క్రీడల్లో ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థినులు ఉన్నతస్థాయిలో రాణించేందుకు అవసరమైన ఆర్థిక సహాయం అందిస్తామని తెలిపారు. కళాశాలలో అదనపు తరగతి గదులను త్వరలోనే ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. కళాశాల విద్యార్థినులు సాధించిన విజయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు జిల్లా స్థాయిలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉన్నతాధికారులను ఆహ్వానించి విద్యార్థినుల ప్రతిభను అభినందించేలా చర్యలు తీసుకుంటామన్నారు.కళాశాలలో సౌర విద్యుత్ సౌకర్యాన్ని ఏర్పాటు చేయిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. విద్యుత్ అవసరాలను తీర్చడంతో పాటు కళాశాల ఆవరణలో విద్యార్థినులకు ఇబ్బందిగా ఉన్న కోతుల బెడదను నివారించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. విద్యార్థినులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అంకంపాలెం సర్పంచ్ మోకాళ్ల గురుమూర్తి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి వి. వెంకటరావు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

# అశ్వారావుపేట నియోజకవర్గానికి మహర్దశ!

(మొదటి పేజీ తరువాయి...)

కలిసి సందర్శించారు. రైతులకు ఆయిల్ పామ్ మొక్కలను పంపిణీ చేసి సాగు పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పామాయిల్ ఫ్యాక్టరీ ఆవరణలో నూతనంగా నిర్మించనున్న పామాయిల్ ఫ్యాక్టరీ స్థలాన్ని పరిశీలించి సంబంధిత అధికారులతో నిర్మాణ పనులపై చర్చించారు.

**70 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు అవసరం**

దేశవ్యాప్తంగా ప్రస్తుతం కేవలం 15 లక్షల ఎకరాల్లో మాత్రమే ఆయిల్‌పామ్ సాగు జరుగుతోందని మంత్రి తుమ్మల తెలిపారు. దేశంలో వంట నూనెల అవసరాల కోసం ప్రతి ఏడాది సుమారు రూ.2 లక్షల కోట్లు విదేశాలకు వెళ్తున్నాయని చెప్పారు. ఈ పరిస్థితిని మార్చాలంటే దేశవ్యాప్తంగా ఆయిల్‌పామ్ సాగును సుమారు 70లక్షల ఎకరాలకు విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు.70 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు జరిగితే దేశీయ వంట నూనెల డిమాండ్‌ను గణనీయంగా తీర్చడంతో పాటు, భవిష్యత్తులో విదేశాలకు కూడా వంట నూనెలను ఎగుమతి చేసే స్థాయికి చేరుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. రైతులకు ఆదాయం పెంచే పంటగా ఆయిల్‌పామ్‌ను మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.

**18న దక్షిణ భారత వ్యవసాయ మంత్రుల సదస్సు**

ఈ నెల 18న హైదరాబాద్‌లో దక్షిణ భారత రాష్ట్రాల వ్యవసాయ మంత్రుల సదస్సు నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. ఆయిల్‌పామ్ సాగు విస్తరణ, రైతులకు మద్దతు ధర, సాగు ప్రోత్సాహకాలు, రైతాంగ సంక్షేమం తదితర అంశాలపై సదస్సులో చర్చించనున్నట్లు చెప్పారు. రైతుల ప్రయోజనాలను కాపాడే విధంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు సమష్టి కార్యాచరణ రూపొందిస్తామని వెల్లడించారు.

**కొత్త రకం మొక్కల పంపిణీ**

చీడపీడలను తట్టుకునే సామర్థ్యంతో పాటు రైతులకు మరింత ప్రయోజనం చేకూరేలా కొత్త రకం ఆయిల్‌పామ్ మొక్కలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. తక్కువ ఎత్తులో పెరిగేలా ఆయిల్‌పామ్ మొక్కల్లో జన్యుపరమైన మార్పులు చేసే దిశగా పరిశోధనలు జరుగుతున్నాయని చెప్పారు.కొత్త వెరైటీలకు సంబంధించిన మొక్కల పంపిణీలో కొంత ఆలస్యం జరిగిందని, నాణ్యమైన మొక్కలు అందుబాటులోకి వచ్చిన వెంటనే రైతులకు అందజేస్తామని తెలిపారు. రైతులకు నాణ్యమైన మొక్కలు అందించడంతో పాటు సాగులో అవసరమైన సాంకేతిక సహకారం, సస్యరక్షణ చర్యలు, ఎరువులు, బిందు సేద్యానికి రాయితీలు తదితర సౌకర్యాలను అందిస్తామని చెప్పారు.

**'అశ్వారావుపేట నాకు రాజకీయ జన్మనిచ్చింది'**

అశ్వారావుపేట ప్రాంతం తనకు రాజకీయ జన్మనిచ్చిందని మంత్రి తుమ్మల అన్నారు. ఈ ప్రాంతంతో తనకు విడదీయరాని అనుబంధం ఉందని తెలిపారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా అశ్వారావుపేట ప్రాంత అభివృద్ధికి తన వంతు కృషి చేశానని చెప్పారు.ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో అశ్వారావుపేట నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలకు మరింత ఊతం లభిస్తోందని, ఈ ప్రాంతానికి మహర్దశ తీసుకువచ్చేలా పనిచేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

**ఆయిల్‌పామ్ రైతులకు అండగా ప్రభుత్వం**

ఆయిల్‌పామ్ సాగును రాష్ట్రవ్యాప్తంగా మరింత విస్తరించి రైతులకు అధిక ఆదాయం అందించే దిశగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని మంత్రి తెలిపారు.రైతులు ఆయిల్‌పామ్ సాగు వైపు మరింతగా వచ్చేలా అవసరమైన ప్రోత్సాహకాలు అందిస్తున్నామని చెప్పారు.నాణ్యమైన మొక్కల పంపిణీతో పాటు బిందు సేద్యానికి రాయితీలు, ఎరువులు, సస్యరక్షణ చర్యలకు ప్రోత్సాహకాలు, సాంకేతిక సహకారం వంటి అనేక సౌకర్యాలను రైతులకు అందుబాటులోకి తీసుకువస్తున్నామని వివరించారు. ఆయిల్‌పామ్ రైతులకు దీర్ఘకాలికంగా మంచి ఆదాయాన్ని అందించే పంటగా మారుతోందన్నారు.

**గెలల ధర రూ.24 వేలకు పైగా**

ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయిల ్ పామ్ గెలల ధర గణనీయంగా పెరిగిందన్నారు. ధరలో తగ్గుదల లేకుండా క్రమంగా పెరుగుతూ ప్రస్తుతం ఆయిల్‌పామ్ గెలల ధర రూ.24వేలకు పైగా పలుకుతోందని తెలిపారు.రైతులకు గిట్టుబాటు ధర లభించేలా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో ఆయిల ్ పామ్ రైతుల్లో నమ్మకం మరింత పెరిగిందన్నారు. రైతులకు ఇంతటి మంచి ధర లభించేందుకు కృషి చేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు.

**ఆయిల్‌పామ్‌తో రైతుల జీవితాల్లో సిరులు**

రైతుల ఆదాయం పెంచే పంటలను ప్రోత్సహించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. ఆయిల్‌పామ్ సాగుకు అవసరమైన రాయితీలు, ఎరువులు, బిందు సేద్యం, సస్యరక్షణ చర్యలు, ఇతర సౌకర్యాలను అందించడం ద్వారా సాగును మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.ఆయిల్‌పామ్ సాగుతో రైతుల జీవితాల్లో సిరులు కురుస్తున్నాయని, అశ్వారావుపేట ప్రాంతం ఆయిల్ పామ్ సాగుకు మరింత పెద్ద కేంద్రంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందని తెలిపారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఫ్యాక్టరీ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు అవసరమైన మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

**నూతన పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణ స్థల పరిశీలన**

పర్యటనలో భాగంగా మంత్రి తుమ్మల పామాయిల్ ఫ్యాక్టరీ ఆవరణలో నూతనంగా నిర్మించనున్న ఫ్యాక్టరీ స్థలాన్ని పరిశీలించారు. ఫ్యాక్టరీ నిర్మాణంతో ఆయిల్‌పామ్ రైతులకు మరింత ప్రయోజనం చేకూరేలా చూడాలని అధికా రులకు సూచించారు. రైతుల నుంచి వచ్చే గెలలను సకాలంలో క్రషిం గ్ చేసి, రవాణా సమస్యలు లేకుం డా అవసరమైన మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, ఆయిల్‌పామ్ రైతు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆలపాటి రామచంద్ర ప్రసాద్, ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు, అశ్వారావుపేట మున్సిపల్ చైర్‌పర్సన్ జూపల్లి శశికళ, వైస్ చైర్మన్ జూపల్లి రమేష్, రావు గంగాధర్‌రావు, మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, ఆయిల్‌ఫెడ్ అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆయిల్‌పామ్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లందు భవిష్యత్తుకు ఎలాంటి డోకా లేదు

**ఇల్లందు, సెప్టెంబర్ 6 (ప్రజా జ్యోతి)** సింగరేణికి పుట్టినిల్లయిన ఇల్లందు ఏరియా భవిష్యత్తుకు ఎలాంటి డోకా లేదని, పూసపల్లి ఓసి ప్రారంభానికి ఆటంకాలు తొలగాయని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఆదివారం ఇల్లందు ఏరియా కోయగూడెం ఓపెన్ కాస్ట్ లో ఐఎన్టియుసి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గేటు మీటింగ్ లో ఎమ్మెల్యే మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం ఇప్పటికే పూసపల్లి ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టుకు సంబంధించి టెండర్ ప్రక్రియను ప్రారంభించిందని పేర్కొన్నారు. ప్రాజెక్టుకు సంబంధించిన ప్రక్రియలను వేగవంతం చేసి అతి త్వరలో పూసపల్లి ప్రాజెక్టు పనులు ప్రారంభమయ్యే విధంగా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. పూసపల్లి ప్రాజెక్టు ప్రారంభం వల్ల ఈ ప్రాంత అభివృద్ధితో పాటు స్థానికులకు ఉపాధి అవకాశాల కల్పన, సింగరేణి సంస్థ పురోగతికి దోహదపడుతుందన్నారు. కోయగూడెం ఓపెన్ కాస్ట్ ట్రైబల్ ఏరియా రాజ్యాంగంలోని ఫిఫ్త్ షెడ్యూల్ పరిధిలో ఉన్నప్రాంతంలో ఉందని, ఈ ప్రాంతానికి సంబంధించిన చట్టాలు, నిబంధనలు, ట్రైబల్ ప్రజలకు కల్పించబడిన రాజ్యాంగబద్ధమైన హక్కులను పరిరక్షిస్తూ ప్రాజెక్టుల నిర్వహణ జరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ట్రైబల్ ప్రాంత ప్రయోజనాలు, స్థానిక ప్రజల హక్కులు, ఉపాధి అవకాశాలు, ప్రాంతీయ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. కోయగూడెం ఓపెన్ కాస్ట్ నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో తగిన చర్యలు తీసుకునే అంశంపై కృషి చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. గత ప్రభుత్వ హయాంలో కోయగూడెం ఓపెన్ కాస్ట్ కాంట్రాక్టుకు సంబంధించి తీసుకున్న నిర్ణయాలపై స్థానిక ప్రజలు, కార్మికుల్లో అభ్యంతరాలు వ్యక్తమయ్యాయని గుర్తు చేశారు. ట్రైబల్ ప్రాంతంలో ఉన్న గనులకు సంబంధించి స్థానిక ప్రజల ప్రయోజనాలు, హక్కులకు ఎట్టి పరిస్థితుల్లోనూ భంగం కలగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపారు. కోయగూడెం ప్రాంతం ట్రైబల్, ఫిఫ్త్ షెడ్యూల్ పరిధిలో ఉన్నందున ఈ ప్రాంత ప్రత్యేకతను దృష్టిలో ఉంచుకొని



ప్రభుత్వ పరంగా తగిన విధానపరమైన నిర్ణయాలు తీసుకునేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ విషయమై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తో చర్చించి స్థానిక ప్రజలు, సింగరేణి కార్మికుల ప్రయోజనాలను పరిరక్షించే విధంగా చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పూసపల్లి ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు ప్రారంభానికి మార్గం సుగమం కావడంతో పాటు రాష్ట్ర శాసనసభ అంచనాల కమిటీ చైర్మన్ గా పదవి బాధ్యతలు స్వీకరించిన ఎమ్మెల్యే కోరం కనకయ్యను కార్మికులు, ఐఎన్టియుసి నాయకులు గజమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయుసి సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ త్యాగరాజన్, ఐఎన్టీయుసి ఏరియా ఉపాధ్యక్షుడు జె వెంకటేశ్వర్లు, కార్పొరేట్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ పితాంబరం, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు కోరం సురేందర్, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ భూక్యా నాగేశ్వరరావు, మహబూబ్, బ్రాంచ్ సెక్రటరీ రాంబాబు, కేఓసి పిట్ సెక్రటరీ కోసూరి సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ, కాంట్రాక్ట్ కార్మికుల యూనియన్ సెక్రటరీ రామారావు, సెంట్రల్ నాయకుడు తోట వెంకటేశ్వర్లు, కాంట్రాక్ట్ వర్క్ మెన్ ఇంచార్జ్ సుధాకర్ అసిస్టెంట్ పిట్ సెక్రటరీ అశోక్, బేస్ రిలీఫ్ ఇన్ చార్జ్ రమేష్, లేడీ రిప్రజెంటేటివ్ ఇన్ చార్జ్ శారద, రిలీఫ్ ఇన్ చార్జ్ రామకృష్ణ, జనరల్ షిఫ్ట్ ఇన్ చార్జ్ భావ్ సింగ్, సేఫ్టీ కమిటీ మెంబర్ శ్రీనివాస్, నాయకులు రాము, జీవరత్నం, రాజయ్య, సందీప్, రాందాస్, దేవ్ జీ, రాజేష్, శంకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# టీటిడబ్ల్యూజేఏ జిల్లా అధ్యక్షుడిగా మాళోత్ అశోక్

- ప్రధాన కార్యదర్శిగా భూక్య రాము.. ఏకగ్రీవంగా నూతన కమిటీ ఎన్నిక
- జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల సాధన కోసం ఐక్యంగా పనిచేస్తాం
- ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు తదితర సమస్యల పరిష్కా రానికి కృషి



**కొత్తగూడెం సెప్టెంబర్ 6, ప్రజాజ్యోతి** : తెలంగాణ ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీటిడబ్ల్యూజేఏ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. జిల్లా కేంద్రంలోని శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు.జిల్లా అధ్యక్షుడిగా మాళోత్ అశోక్, ప్రధాన కార్యదర్శిగా భూక్య రాము, ట్రెజరర్‌గా బానోత్ రాందాస్, ఉపాధ్యక్షుడిగా బదావత్ దశరథ్ ఎన్నికయ్యారు. గౌరవ సలహాదారులుగా హేలావత్ రామారావు, కార్యదర్శులుగా అజ్మీరా సురేష్, బాదావత్ కోటేష్, ధరావత్ వెంకట్, బానోత్ రాము, కొర్రా శివరాం ఎన్నికయ్యారు. సభ్యులుగా కృష్ణ, రంజిత్, నాగేశ్వరావు, సైదులు,రఘురాం,బి.సురేష్,బి.రాం చందర్‌లను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు ట్రైబల్ జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల సాధనతోపాటు వృత్తిపరమైన సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పని చేస్తామని తెలిపారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, ప్రత్యేక సంక్షేమ చర్యల కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, మాళోత్ రాందాస్ నాయక్, మేయర్ మూడ్ గణేష్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్‌పాషా, మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ లాల్‌సింగ్, టీయూడబ్ల్యూజే–143 రాష్ట్ర ట్రెజరర్ యోగినంద, టీటిడబ్ల్యూజేఏ రాష్ట్రప్రధాన కార్యదర్శి ర వినాయక్ తదితరులు పాల్గొని నూతన కమిటీకి అభినందనలు తెలిపారు.

## ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్ సెప్టెంబర్ 6, (ప్రజా జ్యోతి)** నేడు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు ఉదయం 10గంటలకు హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని సూచించారు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని కలెక్టర్ తెలిపారు, సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లా ప్రజల సౌకర్యార్థం సబ్ కలెక్టర్ భద్రాచలం కార్యాలయంలో,ఆర్డీవో కార్యాలయం కొత్తగూడెంలో ప్రజావాణి నిర్వహించబడుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

## అపోలో డయాగ్నస్టిక్ సెంటర్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే తెల్లం





**కొత్తగూడెం కలెక్టరేట్ భద్రాచలం / సెప్టెంబర్ 6, (ప్రజా జ్యోతి)** భద్రాచలం పట్టణంలోని చర్ల రోడ్డులో రాధా హాస్పిటల్ పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన అపోలో డయాగ్నస్టిక్ సెంటర్ ను భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు ఆదివారం ప్రారంభించారు, ఎమ్మె ల్యే మాట్లాడుతూ మల్ల ప్రతాప్ కుమారుడు నూతనంగా ఏర్పాటు చేసిన అపోలో డయాగ్నస్టిక్ సెంటర్ ద్వారా భద్రాచలం పరిసర ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య పరీక్షలు అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించే విధంగా ఈ డయాగ్నస్టిక్ సెంటర్ ఉపయోగపడాలని ఆకాంక్షించారు.ప్రజలకు అవసరమైన వైద్య సేవలు స్థానికంగానే అందుబాటులోకి రావడం వల్ల సమయం, ఖర్చు ఆదా అవుతుందని, నిర్వాహకులు నాణ్యమైన సేవలను అందిస్తూ ప్రజల విశ్వాసాన్ని పొందాలని ఎమ్మెల్యే సూచించారు.ఈ కార్యక్రమంలో భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ , ఉపసర్పంచ్ రత్నం, కవిత ,వార్డు సభ్యులు నర్రా వాణి , కారం దుర్గారావు , పార్టీ నాయకులు, పట్టణ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పాల్వంచలో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్



**కొత్తగూడెం కలెక్టరేట్ ,పాల్వంచ / సెప్టెంబర్ 6, (ప్రజా జ్యోతి)** పాల్వంచ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని నవభారత్ నుంచి ఇందిరా కాలనీ వరకు ఆదివారం ఉదయం 8 గంటల నుంచి ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలతో పాటు సెంటర్ డివైడర్‌ను పూర్తిస్థాయిలో శుభ్రం చేసే కార్యక్రమాన్ని కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, డిప్యూటీ మేయర్ ఎస్ లలిత కుమారి లు స్వయంగా పాల్గొని పర్యవేక్షించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచే లక్ష్యంతో మున్సిపల్ సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన పారిశుద్ధ్య పనులు చేపట్టారు.అదేవిధంగా రోడ్డు మధ్యలో ఉన్న మొక్కలను పరిరక్షించడం, వాటికి క్రమం తప్పకుండా నీరు అందించడం వంటి అంశాలపై కూడా మేయర్, డిప్యూటీ మేయర్ ప్రత్యేక దృష్టి సారించారు. కార్మికులతో కలిసి దగ్గరుండి పనులను పర్యవేక్షిస్తూ, శుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారు.పాల్వంచ పట్టణాన్ని పరిశుభ్రంగా, పచ్చదనంతో తీర్చిదిద్దేందుకు మున్సిపాలిటీ చేపడుతున్న ఈ ప్రత్యేక డ్రైవ్‌పై ప్రజలు కూడా సహకరించి చెత్తను రోడ్లపై వేయకుండా, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని వారు కోరారు , ఈ కార్యక్రమంలో పాల్వంచ మున్సిపల్ శానిటేషన్ అధికారులు చౌహాన్, పలువురు జవాన్లు ,సిబ్బంది పాల్గొన్నారు.

## పెద్దమ్మ తల్లి ఆలయానికి పోటెత్తిన భక్తులు



**కొత్తగూడెం కలెక్టరేట్ , సెప్టెంబర్ 6 , (ప్రజా జ్యోతి)** పాల్వంచ మండల పరిధిలోని కెపి, జగన్నాధపురం గ్రామంలో కొలువు తీరిన పెద్దమ్మ తల్లి ఆలయానికి భక్తులు పోటెత్తారు, ఆదివారం సెలవు రోజు ,అదేవిధంగా శ్రావణమాసం ఆఖరి ఆదివారం కావడంతో ఉమ్మడి జిల్లాల నుండే కాకుండా, వివిధ ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తమ తమ మొక్కుబడులను చెల్లించుకొని ప్రత్యేక పూజలు చేశారు, దీంతో ఆలయం భక్తులతో కిటికీటలాడుతూ కనిపించింది, ఆలయ ప్రాంగణంలోని అన్నపూర్ణ సమేత కాశి విశ్వేశ్వర స్వామి వారి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు, ఆలయానికి వచ్చిన కొంతమంది భక్తులు అన్నప్రాసనలు, వాహన పూజలు, తలనీలాలు, అమ్మవారికి ఒడివియ్యం, చీరలు ,కనుములు తదితర ముక్కులను చెల్లించుకొని అమ్మవారి దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు, ఆలయానికి వచ్చిన భక్తులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా ఆలయ ఈవో రజిని కుమారి ఆధ్వర్యంలో అన్ని సౌకర్యాలను పర్యవేక్షించారు, అదేవిధంగా ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా పాల్వంచ రూరల్ పోలీసులు శాంతి భద్రతలను పరిరక్షించారు.

## పెద్దమ్మ తల్లి ఆలయంలో నిత్య అన్నదానం



**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 6, (ప్రజా జ్యోతి)** పాల్వంచ మండల పరిధిలోని కెపి విజయనగపురం గ్రామంలో కలువుతీరిన పెద్దమ్మతల్లి ఆలయ ఆవరణలో నూతక్కి శ్రీనివాసరావు చే నిర్మించిన అన్నదాన సత్రం నందు ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు, ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి రజనీకుమారి, సిబ్బంది పాల్గొన్నారు, అదేవిధంగా ఈనెల 7న సోమవారం నాగేశ్వరరావు జ్యోతి దంపతులు అయినా జ్యోతి పుట్టినరోజు సందర్భంగా అన్నదానం నిర్వహించేందుకు గాను రూ5'116 లను అందజేశారు, ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ఆలయ ఆవరణలో భక్తులు తమ కుటుంబ సభ్యుల, బంధుమిత్రుల పుట్టిన రోజులు పెళ్లి రోజులు, ఇతరత్రా ముఖ్యమైన రోజులు సందర్భంగా అన్నదానం చేయదలచిన భక్తులు ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని ఈఓ రజనీకుమారి కోరారు.

## షెడ్యూల్ తెగల జాబితా నుండి లంబాడీలను తొలగించాలి

- ప్రభుత్వం ప్రత్యేక కమిషన్ను ఏర్పాటు చేయాలి
- హైదరాబాదులో తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయండి
- తుడుం దెబ్బ జాతీయ కార్యదర్శి రమణాల లక్ష్మయ్య



**గుండాల సెప్టెంబర్ 6 ప్రజా జ్యోతి** షెడ్యూల్ తెగల జాబితా నుండి లంబాడీలను తొలగించాలని, దీనికోసం ప్రభుత్వం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని తుడుం దెబ్బ జాతీయ కార్యదర్శి రమణాల లక్ష్మయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ అంశంపై తునం దెబ్బ, ఆధార్ సొసైటీ, ఏ ఈ డబ్బులు సిఏ లా ఆధ్వర్యంలో సెప్టెంబర్ 18న హైదరాబాదులో జరిగే మహాధర్నను జయప్రదం చేయాలని కోరారు. ఆదివాసులు అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న చట్టాలను లంబాడీలు ఎగరవేసుకుపోతున్నారని ఆయన విమర్శించారు. ఆదివాసులు 200 సంవత్సరాలు బ్రిటిష్ కార్పోరేట్ కంపెనీలకు వ్యతిరేకంగా పోరాడి 1874లో ఏజెన్సీ జిల్లాలను బ్రిటిష్ గవర్నమెంట్ ద్వారానే సాధించుకోవడం జరిగిందని, ఆనాటి నుండి ఆదివాసుల అనేక పోరాటాల ఫలితంగా హక్కులు సాధించుకోవడం జరిగిందని, హక్కులను లంబాడాలు అనుభవిస్తూ పోరాడిన ఆదివాసుల కు ప్రయోజనం లేకుండా చేస్తున్నారన్నా రూ, ఆదివాసులు సాధించుకున్న చట్టాలను అన్ని రకాలుగా లంబాడాలు ఉపయోగించుకుంటున్నారని దీనికి ప్రభుత్వాలు కొంత పాడుతున్నాయన్నారు ఇప్పటికైనా ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసి గిరిజనులకు న్యాయం చేయాలని దాని కోసం హైదరాబాదులో తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు వట్టం కన్నయ్య, ఫోన్ ఏం బాలకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి పూణెం శ్రీను , జిల్లా కార్యదర్శి వచ్చా ఎర్రయ్య, ఈసం సాంబయ్య, ఉపాధ్యక్షులు చింత వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షులు గోవింద నరసింహారావు, కార్యదర్శి మోకాళ్ళ మహేందర్, మహేందర్ భార్గవ్ వినోద్ జోషి తదితరులు పాల్గొన్నారు.

## సమాజంలో విలేకరుల పాత్ర కీలకం

- కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి ఖదీర్



**గుండాల సెప్టెంబర్ 6 ప్రజా జ్యోతి** సమాజంలో విలేకరుల పాత్ర కీలకమని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్కే ఖదీర్ అన్నారు, ఆదివారం మండల కేంద్రంలో జర్నలిస్ట్ డే సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ అనేక వడిదుడుకులను ఎదుర్కొంటూ పనిచేస్తున్నారని ఆయన అన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరవేయాలంటే విలేకరుల కృషి అమోఘమని అన్నారు ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని పనిచేస్తున్న విలేకరులను సన్మానించారు ఈ కార్యక్రమంలో పాత్రికేయులు యాసారపు తిరుపతి, మాచర్ల రంజిత్, గడ్డం నారాయణ, తవిడిశెట్టి నాగరాజు, యాసారపు యాకయ్య, కోడూరి పాపయ్య చారి, ఓకే రామకృష్ణ,, పిండి కట్ల సత్యం, మాచర్ల వంశీ, తవుడోజు సురేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఊకె బుచ్చయ్య, దారా అశోక్, కాసిం, పుష్ప రాజు, వాజిద్, శ్రీను, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

## కొండగావ్‌లో నక్సల్ డంప్ గుర్తింపు

- ఒక పిస్టల్, ఆరు వాకీ-టాకీలు, భారీగా పేలుడు పదార్థాలు స్వాధీనం





**చర్ల , సెప్టెంబర్ 06: (ప్రజా జ్యోతి):** ఛత్తీస్‌గఢ్‌లోని కొండగావ్ జిల్లాలో నక్సల్ వ్యతిరేక ఆపరేషన్‌లో భద్రతా దళాలు కీలక విజయాన్ని సాధించాయి. పుష్పాల్ ప్రాంతంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో చేపట్టిన గాలింపు చర్యల్లో నక్సలైట్లు భూగర్భంలో దాచిన డంప్‌ను భద్రతా సిబ్బంది గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.స్వాధీనం చేసుకున్న డంప్‌లో ఒక పిస్టల్, సుమారు ఆరు వాకీ–టాకీలు, గన్‌పౌడర్, బాంబుల తయారీకి ఉపయోగించే వైర్లు, భారీగా పేలుడు పదార్థాలు, ఇతర నక్సలైట్ సామాగ్రి ఉన్నట్లు అధికారులు తెలిపారు.పేలుడు పదార్థాలు ఉండటంతో భద్రతా సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్ (బీడీఎస్) సహాయంతో అనుమానాస్పద పదార్థాలను సురక్షితంగా తొలగించారు. అనంతరం పరిసర ప్రాంతాల్లో గాలింపు, నిఘా చర్యలను ముమ్మరం చేశారు.స్వాధీనం చేసుకున్న వాకీ–టాకీలు, ఆయుధాలు, పేలుడు పదార్థాల ఆధారంగా నక్సలైట్ నెట్‌వర్క్‌కు సంబంధించిన వివరాలను తెలుసుకునేందుకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ డంప్ ఏ నక్సలైట్ గ్రూపునకు చెందినది, ఎప్పటి నుంచి అక్కడ ఉంది, ఏ ఉద్దేశంతో దాచారనే అంశాలపై అధికారులు విచారణ చేస్తున్నారు.కొండగావ్ జిల్లాలోని సున్నితమైన అటవీ ప్రాంతాల్లో నక్సలైట్ కార్యకలాపాలను అడ్డుకునేందుకు భద్రతా దళాలు నిరంతరం గాలింపు, నిఘా చర్యలు కొనసాగిస్తున్నాయి. పుష్పాల్ ప్రాంతంలో భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలు, కమ్యూనికేషన్ పరికరాలతో కూడిన డంప్ స్వాధీనం కావడం నక్సల్ వ్యతిరేక చర్యల్లో కీలక విజయంగా అధికారులు భావిస్తున్నారు .

# మణుగూరులో ధర్నాలు,ర్యాలీల రాజకీయం

- రోడ్లపై ఒకరిపై ఒకరు విమర్శలు.! ప్రజా సమస్య లు నట్టేట్లో..!!
- కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ ఆరోపణల పర్వం
- సామాన్య ప్రజలకు, ఆసుపత్రికి వెళ్లేవారికి తప్పని కష్టాలు
- ధర్నాలతో ఒరిగేదేమీ లేదు - పాలనపై దృష్టి పెట్టాలంటున్న రాజకీయ మేధావులు







**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి/మణుగూరు, సెప్టెంబర్ 06,** ప్రజాజ్యోతి భద్రాద్రి మణుగూరులో ప్రస్తుతం ధర్నాలు,ర్యాలీల రాజకీయం నడుస్తోంది.అభివృద్ధి, ప్రజా సమస్యలు పక్కన పెట్టి ఒకరిపై ఒకరు విమర్శ లు చేసుకుంటూ ధర్నాలు,ర్యాలీల రాజకీయం చేస్తున్నారనే విమర్శలే జోరుగా వినిపిస్తున్నాయి.అధికార కాంగ్రెస్ పార్టీపై ప్రతిపక్ష బీఆర్ఎస్,బీఆర్ఎస్ పార్టీపై కాంగ్రెస్ పరస్పరం ఆరోపణలు, విమర్శలు చేసుకుంటూ దాదా పు ప్రతి రోజూ ఎక్కడో ఒక చోట ధర్నాలు,ర్యాలీలు నిర్వహిస్తున్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీల హోరెత్తింపులతో మణుగూరులోని ప్రధాన రహదారులన్నీ నిత్యం ట్రాఫిక్ జామ్ తో స్తం భించిపోతున్నాయి.దీంతో ఆసుపత్రికి వెళ్లే రోగులు, అత్యవసర పనులపై వెళ్లే సామాన్య ప్రజలు,విద్యార్థులు తీవ్ర ఇ బ్బందులు ఎదుర్కొంటున్నారు.అంతేగాక గంటల తరబడి రోడ్లపైనే నిలిచిపోవాల్సిన పరిస్థితి నెలకొంది.అసలు ప్రజా సమస్యలైన రోడ్లు,తాగునీరు, సింగరేణి కార్మికుల సమస్యలు, నిరుద్యోగం,పేదల ఇండ్లు, జర్నలిస్ట్ ల సమస్యలు తదితర వంటి ఎన్నో అంశాలను పక్కన పెట్టి కేవలం రాజకీయ ఆధిప త్యం కోసమే ఈ ధర్నాలు చేస్తున్నారని ప్రజలు,మేధావులు చర్చించుకుంటున్నారు.ధర్నాలు, ర్యాలీల రాజకీయం వల్ల ప్రజలకు ఒరిగేదేమీ లేదని, నాయకులు ప్రజా సమస్యల పరిష్కారం దిశ గా పరిపాలన చేయాలని రాజకీయ మేధావులు,ప్రజలు హితవు పలుకుతున్నారు.

## విద్యతోనే జీవితానికి వెలుగులు

- ప్రముఖ వ్యాపారి ఎడారి గణపతి



**చర్ల, సెప్టెంబర్ 06: (ప్రజాజ్యోతి):**చదువుకు దూరంగా ఉన్న గిరిజన విద్యార్థులకు అండగా నిలిచి, వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని ప్ర ముఖ వ్యాపారి ఎడారి గణపతి పిలుపునిచ్చారు. తన కుమార్తె దివంగత ఎడారి వెంకట కావ్య జ్ఞాపకార్థం చర్లలోని కొమరం భీం విద్యార్థి నిలయంలో 75 కిలోల బియ్యాన్ని అందజేయడంతో పాటు విద్యార్థులకు ఒకపూట భోజ నం ఏర్పాటు చేశారు.కొమరం భీం విద్యార్థి నిలయ కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో గణపతి మాట్లాడుతూ గిరిజనుల అభ్యున్నతి కోసం వనవాసీ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యాబోధన అం దించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, ఉత్తమ ప్రవర్తనను అలవర్చుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. పేద విద్యార్థుల విద్యకు తన వంతు సహకారం అందించడం ఆనందంగా ఉందని తెలిపారు. తనతో పాటు మరింత మంది దాతలు ముందుకు వచ్చి విద్యార్థుల చదువుకు తోడ్పాటు అందించాలని కోరారు.వనవాసీ ప్రాంత మహిళా సహ ప్రముఖ్ పెద్దాడ ఆశాలత మాట్లాడుతూ సంస్థ ద్వారా గిరిజనులకు విద్య, వైద్య సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. మారుమూల ప్రాంతాల నుంచి వచ్చే ఆదివాసీ విద్యార్థులకు విద్యతో పాటు వారి సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను పరిచయం చేస్తూ సమగ్రంగా తీర్చిదిద్దుతున్నట్లు వివరించారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి పలువురు దాతలు సహకారం అందించేందుకు ముందుకు రావడం శుభపరిణామమన్నారు. ఎడారి గణపతి వంటి దాతల సహకారం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. విద్యార్థులు లభిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.ఎడారి లక్ష్మణ్ రావు, వనవాసీ జిల్లా కార్యదర్శి కోరం సూర్యనారాయణ, కొమరం భీం విద్యార్థి నిలయ అధ్యక్షుడు తాటి పాపారావు, ఉపాధ్యక్షులు గోగికార్ రాంలక్ష్మణ్, సహ కోశాధికారి వేములపల్లి ప్రవీణ్ బాబు, కమిటీ సభ్యురాలు పోలిన రమాదేవి, నిలయ ప్రముఖులు వరలక్ష్మి , సంతోష్, సహ నిలయ ప్రముఖ్ ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ ముత్యాలమ్మ తల్లి ఆలయంలో ఘనంగా శ్రావణమాస ఉత్సవాలు

- నాలుగో ఆదివారం సందర్భంగా బోనాల సమర్పణ





**పాల్వంచ, సెప్టెంబర్ 6, ప్రజాజ్యోతి:**పాల్వంచ పట్టణ పరిధిలోని గాంధీనగర్ 5వ వార్డు, 44వ డివిజన్‌లో 1951లో పెద్దపాల చెట్టు కింద వెలసిన శ్రీ ముత్యాలమ్మ తల్లి ఆలయంలో శ్రావణమాస ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శ్రావణమాసం 23వ రోజు, నాలుగో ఆదివారం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.ఉత్సవాల్లో భాగంగా ప్రతి ఇంటి నుంచి బియ్యం, పప్పు, బెల్లం, పసుపు, కుంకుమ తదితర పూజా సామగ్రిని సేకరించి మట్టికుండలో ప్రత్యేకంగా వండి ఉమ్మడి బోనం తయారు చేశారు. ఈ బోనాన్ని సాక్షాత్తు అమ్మవారి స్వరూపంగా భావించి మహిళలు తలపై ఎత్తుకొని భక్తిశ్రద్ధలతో ఊరేగింపు నిర్వహించారు.నేలతాళాలు, డప్పు వాయిద్యాలు, పూనకాలతో పాటు మేకపోతులతో పురవీధుల గుండా సాగిన ఊరేగింపు ఆలయం వరకు కొనసాగింది. అనంతరం మహిళలు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి, పొంగలి బోనాలను శ్రీ ముత్యాలమ్మ తల్లికి నైవేద్యంగా సమర్పించారు.తదుపరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. తమ కుటుంబాల్లోని పిల్లాపాపలు ఆరోగ్యంగా ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలు కలగాలని అమ్మవారిని భక్తులు వేడుకున్నారు. ఆలయ ధర్మకర్త గంగపురి నాగేశ్వరరావు, ఆలయ పూజారి గడ్డం భాస్క ర్‌దాస్, కేసుపాక వెంకటేశ్వర్లు, లాయర్ కృష్ణదంపతులు, సీహెచ్ చంద్రకళ, కోయిల శివ దంపతులు, డి. ఇందిర, దోసలకూరి శివరామకృష్ణ, డి. రాము, జి. విజయలక్ష్మి , నరిగె మధు, ఎం. రమాదేవి, డి. నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ కార్యాలయంలో వసూళ్ల దందా?

- ఓ ఆర్ఐ నేరుగా చేతివాటం?
- నామాటే శాసనం
- నేను ఏమి చెప్పిన వినాల్సిందే?
- ఎంత అడిగితే అంత ఇవ్వాలంటూ ఆదేశాలు!
- లేదంటే మీ సర్టిఫికెట్లు కావనే హుకుం!
- ముఖ్యంగా మున్నూరు కాపు కుల సర్టిఫికెట్లలో ఆర్ఐ ఓపెన్ కలెక్షన్?
- ఒక్కో సర్టిఫికెట్ కు రేటు ఫిక్స్?
- తెలిసిన వారెవ్వరు సర్టిఫికెట్ కోసం రావద్దని ఆదేశాలు!
- నేరుగా సర్టిఫికెట్ దారులతో బేరసారాలు?
- రెండు రోజుల్లో సర్టిఫికెట్ అయిపోతుందని చెబుతున్న వైనం!
- మున్నూరు కాపు కుల సర్టిఫికెట్ రిపోర్ట్ కోసం దర్జాగా వసూళ్ళు?
- ఉన్నతాధికారులు జర స్పందించరూ!

**ఇల్లందు, సెప్టెంబర్ 6 (ప్రజా జ్యోతి)** రెవెన్యూ కార్యాలయంలో సర్టిఫికెట్ల జారీ ప్రక్రియపై మరోసారి ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా మున్నూరు కాపు కుల ధ్రువీకరణ పత్రాలకు సంబంధించిన రిపోర్టుల విషయంలో ఓ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ)పై వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. సర్టిఫికెట్ కోసం వచ్చే వారితో నేరుగా మాట్లాడి, రిపోర్టు త్వరగా కావాలంటే డబ్బులు చెల్లించాల్సిందేనని ఒత్తిడి చేస్తున్నారనే ఫిర్యాదులు వినిపిస్తున్నాయి.

### ఒక్కో సర్టిఫికెట్‌కు 'రేటు' ఫిక్స్?

మున్నూరు కాపు కుల సర్టిఫికెట్లకు సంబంధించిన రిపోర్టుల విషయంలో ఒక్కో దరఖాస్తుదారుడి నుంచి నిర్దిష్ట మొత్తాన్ని వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అధికారికంగా సర్టిఫికెట్ ప్రక్రియకు నిర్ణయించిన ఫీజుతో సంబంధం లేకుండా అదనపు మొత్తాలు అడుగుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది.

### నేరుగా సర్టిఫికెట్‌దారులతో బేరసారాలు?

సాధారణంగా సర్టిఫికెట్ల పరిశీలన, నివేదికల ప్రక్రియ అధికారిక నిబంధనల ప్రకారం జరగాల్సి ఉంటుంది. అయితే సంబంధిత ఆర్ఐ కార్యాలయానికి వచ్చే దరఖాస్తుదారులతో నేరుగా మాట్లాడి, రిపోర్ట్ త్వరగా కావాలంటే అదనపు మొత్తం చెల్లించాలనే విధంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో రెవెన్యూ కార్యాలయంలో జరుగుతున్న ప్రక్రియపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా సదరు దరఖాస్తుదారుడి సన్నిహితులు కానీ.. స్నేహితులు కానీ.. ఎవరు రావద్దంటూ ప్రత్యక్షంగా హుకుం జారీ చేస్తున్నట్లు సమాచారం. దరఖాస్తుదారుడు వ్యక్తిగత పనులు నిమిత్తం అందుబాటులో లేకున్నప్పటికీ ఎలా రావడం సాధ్యమవుతుందని ప్రశ్నలు సైతం ఉత్పన్నమవుతున్నాయి.

### 'రెండు రోజుల్లో సర్టిఫికెట్' అంటూ హామీ?

డబ్బులు చెల్లిస్తే రెండు రోజుల్లోనే సర్టిఫికెట్ ప్రక్రియ పూర్తయ్యేలా చూస్తామని భరోసా ఇస్తున్నట్టు ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. సాధారణ ప్ర క్రియలో సమయం పట్టే దరఖాస్తులు ప్రత్యేకంగా వేగంగా పూర్తవుతున్నాయా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### డబ్బులు ఇవ్వకపోతే సర్టిఫికెట్ రాదా?

అదనపు మొత్తాలు చెల్లించేందుకు నిరాకరిస్తే సర్టిఫికెట్ ప్రక్రియ ముందుకు సాగదని కొందరు దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. 'డబ్బులు ఇవ్వకపోతే మీ సర్టిఫికెట్లు కావనే' తరహాలో వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలు నిజమైతే ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకతపై తీవ్ర ప్రశ్నలు తలెత్తే అవకాశం ఉంది.



### తెలిసినవారికి దూరం?

సర్టిఫికెట్ల కోసం తెలిసిన వ్యక్తులు, మధ్యవర్తుల ద్వారా రావద్దని, నేరుగా సర్టిఫికెట్‌దారులే రావాలని సూచిస్తున్నారనే ప్రచారం కూడా ఉంది. ఈ నేపథ్యంలో మధ్యవర్తులు లేకుండా నేరుగా దరఖాస్తుదారులతోనే బేరసారాలు జరుగుతున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మున్నూరు కాపు కుల సంఘ సర్టిఫికెట్ల విషయంలోనే సదరు ఆర్ఐ ఇలా ప్రత్యక్ష వసూళ్లకు పాల్పడటం ఏమిటనే విమర్శలు ఉన్నాయి.

### 'నా మాటే చెల్లాలి' అన్నట్టుగా?

సంబంధిత అధికారి తన పరిధిలోని సర్టిఫికెట్ ప్రక్రియపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శిస్తూ, తాను చెప్పిన విధంగానే నడుచుకోవాలని సిబ్బందిపై ఒత్తిడి తెస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. దీంతో కార్యాలయంలోని ఇతర సిబ్బంది సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే చర్చ సాగుతుంది. గత కొన్ని రోజుల క్రితం ఓ మున్నూరు కాపు కులానికి సంబంధించిన సర్టిఫికెట్లను మీసేవ ద్వారా ఆన్లైన్ చేయడం జరిగింది. సర్టిఫికెట్ల జారీ విషయంలో నేరుగా ఆ దరఖాస్తుదారుడు కి ఫోన్ చేసి కార్యాలయానికి రావాలని సూచించి, ఆర్ ఐ ఛాంబర్ లో ఎవరు లేని సమయంలో ఆ వ్యక్తిని పిలిచి ఆఫీస్ ఫార్మాలిటీస్ పేరుతో ఒక్కో సర్టిఫికెట్ కు రూ. 500 చొప్పున నాలుగు సర్టిఫికెట్లకు రూ. 2 వేలు వసూలు చేసినట్లు పక్కా సమాచారం.

### మున్నూరు కాపు సర్టిఫికెట్లపైనే ఎందుకు?

మున్నూరు కాపు కుల ధ్రువీకరణ పత్రాలకు సంబంధించిన రిపోర్టుల విషయంలోనే ఈ తరహా ఆరోపణలు ఎక్కువగా ఎందుకు వస్తున్నాయనే ప్రశ్న స్థానికంగా వినిపిస్తుంది. ఈ ప్రక్రియలో అధికారికంగా ఎలాంటి రుసుములు ఉన్నాయి? రిపోర్ట్ జారీకి నిర్ణయించిన కాలపరిమితి ఎంత? అదనపు మొత్తాలు వసూలు చేస్తున్నారనే ఆరోపణల్లో వాస్తవమెంత? అనే అంశాలపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

### ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఎక్కడ?

రెవెన్యూ కార్యాలయంలో సర్టిఫికెట్ల ప్రక్రియ పారదర్శకంగా జరుగుతున్నదా లేదా అనే విషయాన్ని ఉన్నతాధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా సర్టిఫికెట్ల కోసం కార్యాలయాలకు వచ్చే సామాన్య ప్రజల నుంచి ఎలాంటి అదనపు మొత్తాలు వసూలు చేస్తున్నారా? అనే అంశంపై అంతర్గత విచారణ చేపడితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

### ఆరోపణలు నిజమైతే చర్యలు ఉంటాయా?

ప్రభుత్వ కార్యాలయాల్లో ఏదైనా సేవకు నిర్ణయించిన అధికారిక రుసుము మినహా అదనపు మొత్తాలు వసూలు చేయడం జరిగితే అది తీవ్రంగా పరిగణించాల్సిన అంశమైనప్పటికి అధికారులు ఈ విషయంపై విచారణ చేపడితే అసలు నిజాలు బహిర్గతం అవుతాయనేది మాత్రం వాస్తవమని పలువురు దరఖాస్తుదారులు పేర్కొంటున్నారు.

### విచారణ జరిపి వాస్తవాలు బహిర్గతం కానున్నాయా?

మున్నూరు కాపు కుల సర్టిఫికెట్ల రిపోర్టుల విషయంలో జరుగుతున్నాయంటున్న వసూళ్లపై సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. ఆరోపణలు నిరాధారమైతే సంబంధిత అధికారికి స్పష్టత లభించడంతో పాటు, వాస్తవంగా అక్రమ వసూళ్లు జరుగుతున్నట్లయితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. దీనిపై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు చేపడతారో అనేది వేచి చూడాలి.

## గణేషుని ఆశీస్సులతో సకలజనావళికి శ్రీరామరక్ష

- పాతపాల్వంచలో కర్రపూజల్లో పాల్గొన్న 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి



**పాల్వంచ, సెప్టెంబర్ 6, ప్రజాజ్యోతి:** ఆదిదేవుడు శ్రీ గణేశుని ఆశీస్సులే సకలజనావళికి శ్రీరామరక్ష అని కొత్తగూడెం కార్పొరేషన్ 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి అన్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పాతపాల్వంచలో ఉత్సవ మండపాల నిర్మాణానికి నిర్వహించిన కర్రపూజ కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. ఆదివారం పాతపాల్వంచలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద, పాత మున్సిపల్ కార్యాలయం ఎదురుగా, గౌండ్ల బజార్, సాయినగర్ ప్రాంతాల్లో నిర్వహించిన కర్రపూజల్లో కార్పొరేటర్ విమలాదేవి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలు తాము చేపట్టే ప్రతి పనిలో ఎలాంటి విఘ్నాలు కలగకుండా విఘ్నేశ్వరుడైన గణపతిని భక్తిశ్రద్ధలతో పూజిస్తారని అన్నారు. నిత్యం గణపతిని ఆరాధించడం ద్వారా సకల శుభాలు కలుగుతాయని ఆకాంక్షించారు. గణపతి పూజలను నియమనిష్ఠలతో నిర్వహిస్తూ, గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ కౌన్సిలర్ కొత్వాల సత్యనారాయణ, గణేష్ నవరాత్రి మహోత్సవ నిర్వాహకులు, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## అండర్-16 క్రికెట్‌కు ఎంపికైన మణుగూరు క్రీడాకారులు

- హర్షం వ్యక్తం చేసిన ప్రధాన కోచ్ డేవిడ్ రిచర్డ్స్





**మణుగూరు, సెప్టెంబర్ 06 (ప్రజాజ్యోతి) :** మండల పరిధిలోని ముత్యాలమ్మనగర్ పంచాయతీలోని ఎలైట్ క్రికెట్ అకాడమీ నుంచి ఇద్దరు ప్రతిభావంతులైన యువకులు అండర్-16 క్రికెట్ మ్యాచ్‌లకు ఎంపికయ్యారని అకాడమీ ప్రధాన కోచ్ డేవిడ్ రిచర్డ్స్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. టీజీటీ. కౌశిక్, ఎస్.వీ. మోక్షిత్ వర్మ అనే ఇద్దరు క్రీడకారులు ఎలైట్ క్రికెట్ అకాడమీ ప్రధాన కోచ్ డేవిడ్ రిచర్డ్స్ నేతృత్వంలో శిక్షణ పొందుతున్నారు. ఈ సందర్భంగా కోచ్ డేవిడ్ మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థాయి పోటీల్లో రాణించి మణుగూరు ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఎంపికైన క్రీడాకారులు సెప్టెంబర్ 7న సాయంత్రం హైదరాబాద్‌లోని జింఖానా మైదానంలో నివేదించాల్సిందిగా ఖమ్మం జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి చెకూరి వెంకట్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు సెప్టెంబర్ 8న హైదరాబాద్‌లో జరగనున్న అండర్-16 మ్యాచ్‌లు ఆడనున్నారు. దీంతో అకాడమీలో శిక్షణ పొందుతున్న ఇతర క్రీడాకారుల్లోనూ నూతన ఉత్సాహం నెలకొంది. మణుగూరు ప్రాంతం నుంచి అండర్-16 స్థాయి క్రికెట్ పోటీలకు ఇద్దరు క్రీడాకారులు ఎంపికవడం పట్ల క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## పలువురి దశదినకర్మల్లో పాల్గొన్న కొత్వాల దంపతులు

- కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపిన డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు





**పాల్వంచ, సెప్టెంబర్ 6, ప్రజాజ్యోతి:** పాల్వంచ పట్టణ పరిధిలో ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబాలను డీసీఎంఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు, పాతపాల్వంచ 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి ఆదివారం పరామర్శించారు. ఆయా కుటుంబాల్లో జరిగిన దశదినకర్మలు, చిన్నకర్మ, ప్రథమ వర్ధంతి కార్యక్రమాల్లో పాల్గొని మృతులకు నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. పాల్వంచకు చెందిన వ్యాపారవేత్త, మాధురి ఎంటర్‌ప్రైజెస్ అధినేత మల్లంపాటి వెంకటేశ్వరరావు ఇటీవల మృతి చెందగా, ఆదివారం నిర్వహించిన దశదినకర్మ కార్యక్రమంలో కొత్వాల దంపతులు పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే పాతపాల్వంచకు చెందిన కేటీపీఎస్ కార్మిక నాయకులు ముత్యాల కోటేశ్వరరావు మృతి చెందడంతో ఆయన స్వగృహంలో నిర్వహించిన చిన్నకర్మ కార్యక్రమానికి కొత్వాల దంపతులు హాజరై నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. పాల్వంచ టీచర్స్ కాలనీకి చెందిన యనగంటి కాంతమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలోనూ కొత్వాల దంపతులు పాల్గొన్నారు. ఆమె కుమారుడు చంద్రశేఖర్ (బాజీ) తో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మాజీ కౌన్సిలర్ కొత్వాల సత్యనారాయణ, మాజీ జెడ్పీటీసీ యర్రంశెట్టి ముత్తయ్య, బూసి శ్రీను, వజ్జల రాము, ధర్మరాజుల రమేష్, కొండూరి లక్ష్మణ్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ హామీలపై బాకీ కార్డులు

- 7వ డివిజన్‌లో ప్రజలకు వివరించిన కార్పొరేటర్ సింధు తపస్వి



**కొత్తగూడెం, సెప్టెంబర్ 6, ప్రజాజ్యోతి** : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలు తీరును ప్రజలకు వివరిస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో 'బాకీ కార్డుల' పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని 7వ డివిజన్‌లో కార్పొరేటర్ సింధు తపస్వి ఆధ్వర్యంలో ఆదివారం ఈ కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా మహిళలు, వృద్ధులు, యువతతో కలిసి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, వాటి అమలు పరిస్థితిని వివరించారు. మహిళలకు ఇచ్చిన హామీలు, యువతకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, వృద్ధులు, రైతులు, పేదలు, మధ్యతరగతి ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రజలకు గుర్తు చేశారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ 'సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఎంత బాకీ పడ్డారు?' అనే అంశాన్ని బాకీ కార్డుల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని బీఆర్‌ఎస్ నాయకులు తెలిపారు.

**హామీల అమలుపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తాం....**

ఈ సందర్భంగా రాష్ట్రంలో కొనసాగుతున్న రాజకీయ పరిణామాలు, ప్రభుత్వ నిర్ణయాలు, ఎన్నికల హామీల అమలుపై ప్రజల్లో వ్యక్తమవుతున్న అభిప్రాయాలపై చర్చించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలన్నీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపించారు.ఎన్నికల సమయంలో భారీ సంఖ్యలో హామీలు ఇచ్చి ప్రజల మద్దతు పొందిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలులో జాప్యం చేస్తోందని వారు విమర్శించారు. హామీల అమలుపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ ప్రజల్లో అవగాహన కల్పించడమే బాకీ కార్డుల కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు.ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం నెరవేర్చే వరకు ప్రశ్నిస్తామని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడతామని బీఆర్‌ఎస్ నాయకులు పేర్కొన్నారు. ప్రతిపక్షంగా ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, హామీల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని అన్నారు.

ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పూజారి వెంకటేశ్వర్లు, అఖిల్ మహర్షి, గణేష్, నరసింహ, సదన్, మహిళలు, కార్యకర్తలు ఎస్తేరు, కుమారి, ఆదెమ్మ, రాములమ్మ, బంగారమ్మతో పాటు యువత, వృద్ధులు పాల్గొని బాకీ కార్డులను స్వీకరించారు. 7వ డివిజన్‌లో ప్రజలకు కాంగ్రెస్ హామీలను వివరిస్తూ బాకీ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా కొనసాగిస్తామని కార్పొరేటర్ సింధు తపస్వి తెలిపారు.

## ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా.. ఉపాధ్యాయుల కృషికి అభినందన



**బూర్గంపహాడ్, సెప్టెంబరు 6 (ప్రజాజ్యోతి ):** విద్యార్థుల విద్యాభివృద్ధికి అంకిత భావంతో పనిచేసి ఉత్తమ ఫలితాలు సాధించిన ఉపాధ్యాయులను టీచర్స్ డే సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఎంఈఓ వై. సింహరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పదో తరగతి వార్షిక పరీక్షల్లో హిందీ సబ్జెక్టులో 100 శాతం ఫలితాలు సాధించిన ఉపాధ్యాయుడు తేజావత్ మోహన్‌కు బెస్ట్ టీచర్ అవార్డు అందించి సత్కరించారు.అదేవిధంగా ఎంపీపీఎస్ పోలవరం పాఠశాల ఉపాధ్యాయురాలు ఉమాకు సైతం బెస్ట్ టీచర్ అవార్డు అందజేశారు. విద్యార్థులను ఉత్తమ ఫలితాల దిశగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల కృషి అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీస్తూ, నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని అధికారులు, ప్రజా ప్రతినిధులు కొనియాడారు.కార్యక్రమంలో బూర్గంపహాడ్ సర్పంచ్ మందా నాగరాజు, పీజీ హెచ్‌ఎంలు రవిలాదేవి, ఉషారాణి, పీఆర్‌టీ యూ–టీఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు భాస్కర్, మండల నాయకులు మాన్సింగ్, జగన్, చందు, ఈశ్వర్, బాలు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## న్యాయం జరిగే వరకు అండగా ఉంటాం

- రూ.5 లక్షలతో చేతులు దులుపుకోవద్దు
- శిరీష కుటుంబానికి కోటి పరిహారం ఇవ్వాలి: ఎంపీ గోడెం నగేష్



**ములకలపల్లి సెప్టెంబర్ 06 (ప్రజాజ్యోతి):** హైదరాబాద్‌లో హత్యకు గురైన ములకలపల్లి మండలం చౌటిగూడెంకు చెందిన గిరిజన యువతి కుటుంబాన్ని ఆదివారం ఆదిలాబాద్ బీజేపీ ఎంపీ గోడెం నగేష్ నేతృత్వంలోని బృందం పరామర్శించింది. కుటుంబ సభ్యులకు పార్టీ తరఫున ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా గోడెం నగేష్ మాట్లాడుతూ.. శిరీష కుటుంబానికి కేవలం రూ.5 లక్షల పరిహారం, ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని చెప్పి ప్రభుత్వం చేతులు దులుపుకోవడం సరికాదన్నారు. బాధిత కుటుంబానికి రూ.కోటి పరిహారం, శిరీష తమ్ముడికి ప్రభుత్వ ఉద్యోగం, 10 ఎకరాల భూమి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కుటుంబానికి న్యాయం జరిగే వరకు బీజేపీ అండగా ఉంటుందని, అవసరమైతే న్యాయం కోసం అన్ని విధాలుగా పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. మాజీ ఎంపీ సీతారాం నాయక్ మాట్లాడుతూ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన ప్రతి ఒక్కరిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ నిందితులతో పాటు హాస్పిటల్ యాజమాన్యంపైనా చర్యలు తీసుకోవాలన్నారు. శిరీష కుటుంబానికి న్యాయం జరిగే వరకు బీజేపీ పోరాటం కొనసాగుతుందని, ఈ విషయాన్ని జాతీయ మహిళా కమిషన్, జాతీయ ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి డా. విజయచంద్రరెడ్డి, మాజీ ఎంపీ సీతారాం నాయక్, కుంజా ధర్మ, పోడియం బాలరాజు, మండల అధ్యక్షుడు గుగులోత్ శంకర్ నాయక్, కుంజా సంతోష్, పున్నం బిక్షపతి, భోగి కృష్ణయ్య, డా. జాటోత్ వెంకన్న, దొడ్డ అరుణ, సముద్రాల గాయత్రి, కోలా హరీష్, పూనెం నవీన్‌కుమార్ తదితర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## స్థానిక బూడిద కాంట్రాక్టర్లకు న్యాయం చేయాలి

- నాలుగు విద్యుత్ కేంద్రాల పనులను ఒకే టెండర్‌గా ఇవ్వడం సరికాదు: మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్



**పాల్వంచ, సెప్టెంబర్ 6, ప్రజాజ్యోతి:** పాల్వంచ కేటీపీఎస్‌లో బూడిద తరలింపు పనులను ఇతర మూడు థర్మల్ విద్యుత్ కేంద్రాలతో కలిపి ఒకే భారీ టెండర్‌గా నిర్వహించడంపై స్థానిక చిన్న కాంట్రాక్టర్లు వ్యక్తం చేస్తున్న ఆందోళనలను ప్రభుత్వం, విద్యుత్ ఉత్పత్తి సంస్థ అధికారులు వెంటనే పరిగణనలోకి తీసుకుని వారికి న్యాయం చేయాలని మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్ కోరారు.పాల్వంచకు వచ్చిన మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్‌ను స్థానిక బూడిద కాంట్రాక్టర్లు కలిసి వినతిపత్రం అందజేశారు. వారి సమస్యలను తెలుసుకున్న ఆయన, సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు.

**విద్యుత్ సంస్థ ఉన్నతాధికారితో ఫోన్‌లో చర్చ**

కేటీపీఎస్ బూడిద తరలింపు పనులకు సంబంధించిన సమస్యలపై విద్యుత్ ఉత్పత్తి సంస్థ పౌర నిర్మాణ విభాగం సంచాలకులు అజయ్‌తో మాజీ ఎంపీ ఫోన్‌లో మాట్లాడారు. కేటీపీఎస్‌ను మిగిలిన మూడు థర్మల్ విద్యుత్ కేంద్రాలతో కలిపి ఒకే భారీ ప్యాకేజీగా కాకుండా, కేటీపీఎస్‌కు ప్రత్యేకంగా టెండర్ పిలవాలని లేదా పనులను పలు భాగాలుగా విభజించి స్థానిక చిన్న కాంట్రాక్టర్లకు కూడా అవకాశం కల్పించాలని కోరారు.కేటీపీఎస్‌లో అనేక సంవత్సరాలుగా స్థానిక చిన్న కాంట్రాక్టర్లు బూడిద తరలింపు, రవాణా పనులు నిర్వహిస్తూ జీవనోపాధి పొందుతున్నారని అజ్మీరా సీతారాం నాయక్ తెలిపారు. వారి ద్వారా డ్రైవర్లు, క్లీనర్లు, కార్మికులు, వాహన యజమానులు తదితర అనేక కుటుంబాలకు ఉపాధి లభిస్తోందన్నారు. అయితే ప్రస్తుత టెండర్‌లో భారీ స్థాయిలో వార్షిక వ్యాపారం, ఆస్తుల విలువ, వాహనాల సంఖ్య, బూడిద నిర్వహణలో అనుభవం వంటి అర్హతలు నిర్దేశించడం వల్ల స్థానికంగా సంవత్సరాలుగా ఈ పనులు చేసుకుంటున్న చిన్న కాంట్రాక్టర్లు పోటీకి దూరమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

**పెద్ద సంస్థలతో పాటు స్థానికులకూ అవకాశం ఉండాలి**

పెద్ద సంస్థలు టెండర్‌లో పాల్గొనడాన్ని తాము వ్యతిరేకించడం లేదని, అయితే కేటీపీఎస్‌పై ఆధారపడి జీవిస్తున్న స్థానిక చిన్న కాంట్రాక్టర్లకు కూడా పోటీ చేసే అవకాశం కల్పించాలని అజ్మీరా సీతారాం నాయక్ అన్నారు.ఒకే భారీ టెండర్ కారణంగా స్థానిక కాంట్రాక్టర్లందరూ పనులకు దూరమయ్యే పరిస్థితి రావడం సరికాదన్నారు. కేటీపీఎస్ పరిసర ప్రాంతాల ఆర్థిక వ్యవస్థతో బూడిద తరలింపు పనులకు ఎంతో సంబంధం ఉందని, కాంట్రాక్టర్లతో పాటు వాహన యజమానులు, డ్రైవర్లు, కార్మికులు, చిన్న వ్యాపారులు కూడా ఈ పనులపై ఆధారపడి ఉన్నారని పేర్కొన్నారు.స్థానికుల ఉపాధి, సమాన అవకాశాలు, పారదర్శకతను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుత టెండర్ విధానాన్ని అధికారులు పునఃపరిశీలించాలని మాజీ ఎంపీ డిమాండ్ చేశారు.స్థానిక కాంట్రాక్టర్లకు న్యాయం జరిగే వరకు ఈ సమస్యను ప్రభుత్వం, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. రానున్న శాసనసభ సమావేశాల్లో ఈ అంశాన్ని బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సభలో చర్చ జరిగేలా ప్రయత్నిస్తామని అజ్మీరా సీతారాం నాయక్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు భూక్యా సీతారాం నాయక్, పొనిశెట్టి వెంకటేశ్వర్లు, బోడ పుణ్యానాయక్, ధరావత్ సురేష్, గుగులోత్ శంకర్, బానోత్ గంగా, బానోత్ వెంకటేష్, భట్టు నరేష్, భట్టు మధు, ధరావత్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా క్షేత్రంలో ఉంటే ప్రజలు గుండెల్లో పెట్టుకుంటారు

**ఇల్లందు, సెప్టెంబర్ 6 (ప్రజా జ్యోతి)** నిత్యం ప్రజాక్షేత్రంలో ఉంటే ఆ ప్రజలే నాయకులను వారి గుండెల్లో పెట్టుకుంటారని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బొళ్ళ సూర్యం అన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ హరిప్రియ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో చేసిన దారుణాలు, దుర్మార్గపు పాలనను భరించలేని ప్రజలు తిరస్కరించారనీ గుర్తు చేశారు. కేవలం రాజకీయ లబ్ధి కోసం స్టేజీల మీద ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తూ పబ్బం గడుపుతున్నదని విమర్శించారు. పూసపల్లి ఓపెన్ కాస్ట్ ప్రారంభానికి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని, అయితే ఆ విషయాలు తెలుసుకోకుండా ఎమ్మెల్యే కోరం కనకయ్యపై తప్పుడు ఆరోపణలు చేస్తుండడం విడ్డూరంగా ఉందన్నారు. ఇతరులపై బురద జల్లి రాజకీయంగా లబ్ధి పొందాలనుకుంటే ప్రజలు విశ్వసించరని గుర్తు చేశారు. నాడు పదవిలో ఉన్న సమయంలో కానీ, ఓడిపోయిన తర్వాత గాని ఏనాడు ప్రజల మధ్య లేని హరిప్రియ హైదరాబాదు నుండి అప్పుడప్పుడు ఇల్లందుకు చుట్టపు చూపుగా వస్తున్న విషయం అందరికీ తెలిసిందేనని ఆరోపించారు. ఇల్లందు నియోజకవర్గ ప్రజలు ఆ పార్టీ కార్యకర్తలు, నాయకులు పట్టించుకోకపోవడంతో ఇతరులపై మతిభ్రమించి ఆరోపణలు చేయటం సరికాదని పేర్కొన్నారు. సింగరేణిలో అన్ని సౌకర్యాలు కల్పిస్తే గత యూనియన్ ఎన్నికల్లో టీబీజీకేఎస్ ఎందుకు నిలబడలేదని సూటిగా ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల ప్రజలకు గత ఎమ్మెల్యేగా చేసిన వాటిని మరిచి ఇప్పుడు మాట్లాడడం ఏమిటని ప్రశ్నించారు. అన్ని వర్గాల ప్రజలకు ప్రజాపాలనందిస్తూ ముందుకు వెళ్తున్న ప్రభుత్వంపై అక్కసు వెళ్ళగక్కడం సరికాదని హితవు పలికారు. ఇప్పటికైనా వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని లేకుంటే ప్రజలు తిరగబడతారని హెచ్చరించారు.



# విజయవంతమైన మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్

- ఫలించిన తుమ్మల కృషి
- ట్రయల్ రన్ సక్సెస్‌తో రైతుల్లో కొత్త ఆశలు.. సంబరాల్లో మునిగిన అన్నదాతలు
- మారెళ్ళ పాడు ప్రాజెక్టు లిఫ్ట్ ఇరిగేషన్ ట్రయల్ రన్ ప్రారంభించిన పాయం







**అశ్వాపురం, సెప్టెంబర్ 6, ప్రజాజ్యోతి :** మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనుల్లో కీలక ఘట్టం విజయవంత మైంది. ప్రాజెక్టుకు సంబంధించిన ఇరిగేషన్ లిఫ్ట్ కెనాల్ ట్రయల్ రన్ విజయవంతంగా నిర్వహించడంతో తుమ్మల చెరువు పరిసర ప్రాంతాల రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. సాగునీటి కోసం ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న రైతులకు ఈ పరిణామం కొత్త భరోసాను కల్పించింది. ట్రయల్ రన్ విజయవంతం కావడంతో రైతులు ఉత్సాహంగా సంబరాలు నిర్వహించారు.

**ఏళ్ల నిరీక్షణకు తెర**

సాగునీటి వసతులు లేకపోవడంతో వర్షాధారంగా వ్యవసాయం చేస్తున్న రైతులకు మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఎంతో ప్రాధాన్యత కలిగినది. ప్రాజెక్టు పూర్తయితే సాగు భూములకు నీటి సౌకర్యం అందడంతో పంటల సాగు మరింత విస్తరించే అవకాశం ఉంది. ట్రయల్ రన్ విజయవంతం కావడంతో ప్రాజెక్టు ద్వారా నీటి పంపింగ్ ప్రక్రియ కార్యరూపం దాల్చే దిశగా ముందడుగు పడింది.

**పనులపై ప్రత్యేక దృష్టి**

ప్రాజెక్టు పనులు వేగంగా పూర్తయ్యేలా పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రత్యేక చొరవ తీసుకున్నారని రైతులు తెలిపారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు చేపట్టారని పేర్కొన్నారు. ప్రాజెక్టు నిర్మాణ పనులను దగ్గరుండి పరిశీలిస్తూ, రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యంగా అధికారులతో సమన్వయం చేసినట్లు రైతులు గుర్తుచేశారు.

**రైతుల్లో ఉత్సాహం**

లిఫ్ట్ ఇరిగేషన్ ట్రయల్ రన్ విజయవంతం కావడంతో రైతుల్లో ఉత్సాహం నెలకొంది. ప్రాజెక్టు మోటార్లు విజయవంతంగా రన్ కావడంతో తమ పొలాలకు త్వరలో సాగునీరు అందుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు ఆనందం వ్యక్తం చేస్తూ సంబరాలు నిర్వహించారు. ఎన్నాళ్లుగా ఎదురుచూస్తున్న ప్రాజెక్టు ఇప్పుడు అందుబాటులోకి వస్తుండటం తమకు ఎంతో సంతోషంగా ఉందన్నారు.

**వ్యవసాయానికి ఊతం**

మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే పరిసర ప్రాంతాల వ్యవసాయానికి మరింత ఊతం లభించనుంది. సాగునీటి లభ్యత పెరగడంతో రైతులు పంటలను సకాలంలో సాగు చేసుకునే అవకాశం ఉంటుంది. వర్షాలపై ఆధారపడే పరిస్థితి తగ్గి, వ్యవసాయ రంగానికి స్థిరమైన నీటి వనరు అందుబాటులోకి వస్తుందని రైతులు ఆశిస్తున్నారు.

**పాయం చొరవపై హర్షం**

ప్రాజెక్టు పనులు త్వరితగతిన పూర్తిచేసి ట్రయల్ రన్ విజయవంతం కావడానికి పాయం వెంకటేశ్వర్లు చూపిన చొరవ ప్రధాన కారణమని రైతులు అభిప్రాయపడ్డారు. ప్రజాప్రతినిధిగా రైతుల సమస్యలను పట్టించుకుని సాగునీటి ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించడం అభినందనీయమన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయిలో ప్రారంభమై నీరు పొలాలకు చేరే వరకు ఇదే విధంగా సహకారం అందించాలని రైతులు కోరారు. ట్రయల్ రన్ విజయంతో మారెళ్లపాడు ప్రాజెక్టు పరిధిలోని రైతుల్లో నూతనోత్సాహం నెలకొంది. తమ పంట పొలాలకు సాగునీరు అందే రోజు కోసం ఎదురుచూస్తున్నామని, ప్రాజె క్టు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే తమ వ్యవసాయానికి ఎంతో మేలు జరుగుతుందని రైతులు పేర్కొన్నారు.

# న్యాయం చేయకపోతే పోరాటమే

- శిరీష సాక్షిగా పొంగులేటి ఇచ్చిన హామీ ఏమైంది?
- తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత
- ఆస్పత్రిని సీజ్ చేసి.. కేసును సీబీఐకి అప్పగించాలి




**ములకలపల్లి సెప్టెంబర్06 (ప్రజాజ్యోతి ):** హైదరాబాద్ తుక్కుగూడలో హత్యకు గురైన గిరిజన యువతి శిరీష కేసును పారదర్శకంగా దర్యాప్తు చేసి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని చౌటిగూడెం గ్రామంలో శిరీష కుటుంబాన్ని ఆమె పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, శిరీష చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. శిరీష మృతి అత్యంత బాధాకరమన్నారు. కేసు దర్యాప్తులో గోప్యత పాటించడంపై కుటుంబ సభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ బాధిత కుటుంబానికి న్యాయం చేసేందుకు వారికి తీరిక లేకుండా పోయిందని విమర్శించారు. శిరీష సాక్షిగా పొంగులేటి ఇచ్చిన హామీ ఏమైంది? అని కవిత ప్రశ్నించారు. సంబంధిత ఆస్పత్రిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చి నాలుగు రోజులు గడిచినా ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని నిలదీశారు. ఆస్పత్రిని సీజ్ చేసి, కేసును సీబీఐకి అప్పగించి సమగ్ర దర్యాప్తు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గిరిజన యువతి కావడం వల్లే ప్రభుత్వం ఈ కేసును నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆమె ఆరోపించారు. దర్యాప్తును పూర్తిగా పారదర్శకంగా నిర్వహించి, కేసులో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరిపై చట్టపరమైన చర్యలు తీసుకుని కఠినంగా శిక్షించాలని పోలీసు శాఖను కోరారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు తెలంగాణ రక్షణ సేన అండగా ఉంటుందని కవిత స్పష్టం చేశారు. రెండు రోజుల్లో న్యాయం చేయకపోతే.. న్యాయం జరిగే వరకు పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఆమె హెచ్చరించారు. ఆమె వెంట తెలంగాణ రక్షణ సేన నాయకులు ఇస్మాయిల్, రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షులు పడాల మనోజ, మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కనగాల చైతన్య కొత్తగూడెం జిల్లా ఇంచార్జ్ డి. వీరన్న, జిల్లా నాయకులు వాసం రామకృష్ణ, కోరం వెంకటేశ్వర్లు, లకావత్ సురేష్, వంకాడోత్ రవి, సోడెం వెంకటేశ్వర్లు, నమ్మి జగదీశ్, సముద్రాల క్రాంతి, తదితరులు పాల్గొన్నారు.




## వనభోజనాలతో ఉత్సవంగా మారిన పల్లె.. ఐక్యత చాటిన గ్రామ ప్రజలు

- శ్రావణమాసంలో కుటుంబ సమేతంగా వనభోజనాల సందడి
- స్వగ్రామంలో ఒక్కటైన కుటుంబాలతో వెల్లివిరిసిన ఆత్మీయత



**అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 6, ప్రజా జ్యోతి:** శ్రావణమాసం చివరి ఆదివారం సందర్భంగా అన్నపురెడ్డిపల్లి గ్రామ ప్రజలంతా కుటుంబ సమేతంగా సామూహిక వనభోజనాలకు తరలివెళ్లారు. సమీపంలోని అడవులు, తోటల్లో వనభోజనాలు ఏర్పాటు చేసుకుని ఆటపాటలతో ఆనందంగా గడిపారు. శ్రావణమాసంలో గ్రామ ప్రజలంతా ఒకచోట చేరి ఇలాంటి మంచి కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం పట్ల ప్రతి ఒక్కరిలో సంతోషం వ్యక్తమైంది.ఉద్యోగాలు, ఇతర పనుల నిమిత్తం వివిధ ప్రాంతాల్లో ఉంటున్న కుటుంబ సభ్యులు సైతం స్వగ్రామానికి చేరుకుని ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లు, తాతయ్యలు, అమ్మమ్మలు, పిల్లలు కలిసి సందడి చేయడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. చాలా రోజుల తర్వాత కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు ఒకచోట చేరి ఆత్మీయంగా పలకరించుకోవడంతో అందరిలో ఆనందం వెల్లివిరిసింది.ప్రతి కుటుంబం తమకు నచ్చిన విధంగా వంటకాలను సిద్ధం చేసుకుని కలిసి భోజనాలు చేశారు. కొందరు మాంసాహార వంటకాలు, మరికొందరు శాకాహార వంటకాలు తయారు చేసుకుని కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేశారు. చిన్నారులు ఆటపాటలతో సందడి చేయగా, పెద్దలు ఆత్మీయంగా ముచ్చటించుకుంటూ ఆనందంగా గడిపారు.గ్రామ ప్రజలంతా కలిసి స్వగ్రామంలోనే ఇలాంటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకోవడం వల్ల గ్రామంలో ఐక్యత, ఆత్మీయత మరింత బలపడిందని పలువురు పేర్కొన్నారు. శ్రావణమాసం వంటి పవిత్రమైన మాసంలో వనభోజనాల కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో సంతోషకరమైన విషయమని తెలిపారు. నిత్యం ఉద్యోగాలు, వ్యాపారాలు, వివిధ పనుల్లో బిజీగా ఉండే వారికి ఇలాంటి కార్యక్రమాలు కుటుంబ సభ్యులతో, గ్రామ ప్రజలతో కలిసి సమయాన్ని గడిపే మంచి అవకాశాన్ని కల్పిస్తాయని అన్నారు.ఇలాంటి కార్యక్రమాలు గ్రామ ప్రజల మధ్య స్నేహభావాన్ని, సోదరభావాన్ని పెంపొందిస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు. సంవత్సరానికి కనీసం ఒకటి, రెండుసార్లు ఇలాంటి సామూహిక కార్యక్రమాలను నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వనభోజనాలు, ఆటపాటలు, ఆత్మీయ పలకరింపులతో అన్నపురెడ్డిపల్లి గ్రామం మొత్తం సందడిగా మారింది.

## జాతీయ స్థాయి కథలపోటీలో రంగనాథ్ కు ద్వితీయ బహుమతి

**ఇల్లందు, సెప్టెంబర్ 6 (ప్రజా జ్యోతి)** ఉరిమళ్ళ ఫౌండేషన్ అక్షరాలతోవా ఖమ్మం ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి కథల పోటీలో ఇల్లందు ప్రముఖ కథ, రచయిత సుదర్శనం రంగనాథ్ రాసిన కథ పిల్లలు దేవుడు చల్లని వారే కథకు ద్వితీయ బహుమతి రావడం జరిగింది. ఆదివారం ఊరిమళ్ళ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బోడేపూడి విజ్ఞానకేంద్రం ఖమ్మంలో నిర్వహించిన బహుమతి ప్రధానోత్సవ సభలో రంగనాథ్ ను సన్మానించి, మొమేంటోతో పాటు నగదు పురస్కారన్ని అందజేశారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ తన కథకు జాతీయ స్థాయిలో రెండవ బహుమతి రావటం ఆనందంగా ఉందని, అలాగే తనపై మరింత బాధ్యత పెరిగిందని తెలిపారు. ఈ సంవత్సరం జాతీయ స్థాయి కథల పోటీలలో వరుసగా రెండుసార్లు విజయం సాధించటం గర్వంగా ఉందని, కథలు సమాజాన్ని ప్రశ్నించే ఆయుధాలని, సమాజంలోని వివక్షతను, మూఢాచారాలను, వర్గ దోపిడీని నిలదీసే సాధనాలుగా కథలు ఉపయోగ పడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉరిమళ్ళ ఫౌండేషన్ నిర్వాహకులు విరిమళ్ళ సునంద, భోగోజు ఉపేందర్ రావు,దాసోజు శ్రీనివాస్, నామ పురుషోత్తం, కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యులు ప్రసేన్ బెల్లంకొండ, ప్రముఖ సాహితీ వేత్తలు రావులపాటి సీతారం, కొండపల్లి నిహారిణి, బ్రహ్మానంద రెడ్డి, పారుపల్లి ఝాన్సీ రాణి తదితరులు పాల్గొన్నారు.



## శభాష్...ఆయిల్‌ఫెడ్ అధికారులకు మంత్రి అభినందనలు

- పామాయిల్ రైతులకు మెరుగైన సేవలు అందిస్తున్నారంటూ ప్రశంస
- భారీగా గెలల క్రషింగ్ చేసిన ఫ్యాక్టరీ మేనేజర్లకు సన్మానం



**దమ్మపేట, సెప్టెంబరు 6(ప్రజాజ్యోతి):** పామాయిల్ రైతులకు మెరుగైన సేవలు అందిస్తూ, ఫ్యాక్టరీల నిర్వహణలో సమర్థంగా పనిచేస్తున్న ఆయిల్‌ఫెడ్ అధికారులను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభినందించారు. అశ్వారావుపేటలో నిర్వహించిన పామాయిల్ మొక్కల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి.. విధుల్లో ప్రతిభ కనబరిచిన అధికారులను సన్మానించారు.పామాయిల్ రైతులకు సేవలందించడంలో కీలకపాత్ర పోషిస్తున్న అప్పారావుపేట, అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీల మేనేజర్లు నాగబాబు, కార్తీక్, నర్సరీ మేనేజర్ శంకర్‌లను మంత్రి తుమ్మల సన్మానించారు. వీరితో సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాలను సమర్థంగా నిర్వహిస్తున్న శ్రీకాంత్‌రెడ్డిని కూడా మంత్రి అభినందించి సన్మానించారు.

**భారీ క్రషింగ్‌కు ప్రత్యేక ప్రశంస**

ఆగస్టు నెలలో భారీ ఎత్తున పామాయిల్ గెలలను క్రషింగ్ చేయడంలో ప్రత్యేకంగా కృషి చేసిన ఫ్యాక్టరీ మేనేజర్లు నాగబాబు, కార్తీక్‌లను మంత్రి తుమ్మల ప్రత్యేకంగా అభినందించారు. రైతుల నుంచి వచ్చిన గెలలను సకాలంలో క్రషింగ్ చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా సేవలందించడం అభినందనీయమన్నారు. "శభాష్.. పామాయిల్ రైతులకు మరింత మెరుగైన సేవలు అందించాలి" అంటూ మంత్రి అధికారులను ప్రశంసించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఫ్యాక్టరీలు, నర్సరీల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.పామాయిల్ సాగు విస్తరిస్తున్న నేపథ్యంలో రైతులకు నాణ్యమైన మొక్కలు అందించడం, గెలలను సకాలంలో క్రషింగ్ చేయడం, సాంకేతిక సహకారం అందించడం వంటి అంశాల్లో అధికారులు మరింత చురుగ్గా పనిచేయాలని మంత్రి సూచించారు.

## 1000 రోజుల ప్రజా పాలన విజయోత్సవం

- మొద్దులగూడెంలో ఘనంగా వేడుకలు.. 50కి పైగా బైకులతో భారీ ర్యాలీ



**దమ్మపేట, సెప్టెంబరు 6(ప్రజాజ్యోతి):** మొద్దులగూడెం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 1000 రోజుల ప్రజా పాలన విజయోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ గ్రామ, మండల అధ్యక్షుల సమక్షంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ నాయకత్వంలో 50కి పైగా బైకులతో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొని ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం, రూ.2 లక్షల రుణమాఫీ, సన్నవడ్లకు రూ.500 బోనస్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 72 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంపు, సమగ్ర కుల గణన, ఎస్సీ వర్గీకరణ, హైడ్రా ఏర్పాటు, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ తదితర కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.ఎమ్మెల్యే జారే ఆదినారాయణ నాయకత్వంలో నియోజకవర్గంలో ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, గ్రామ, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## టీటీడబ్ల్యూజేఏ జిల్లా అధ్యక్షుడిగా

# మాళోత్ అశోక్



● ప్రధాన కార్యదర్శిగా భూక్య రాము.. ఏకగ్రీవంగా నూతన కమిటీ ఎన్నిక ● జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల సాధనకు ప్రాధాన్యం ● నూతన కమిటీకి ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, జర్నలిస్టు సంఘాల నేతల అభినందనలు ● జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తా: మాళోత్ అశోక్ ● జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వంతో చర్చిస్తా: కూనంనేని సాంబశివరావు ● జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా: మాళోత్ రాందాస్ నాయక్ ● హక్కుల సాధన కోసం జర్నలిస్టులు ఐక్యంగా పోరాడాలి: మూడ్ గణేష్ ● గిరిజన హక్కుల సాధనకు జర్నలిస్టులు కృషి చేయాలి: సాబీర్ పాషా ● సమాజాభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర కీలకం: బానోత్ లాల్ సింగ్ ● హక్కుల కోసం పోరాటాలకు సిద్ధంగా ఉండాలి: యోగినంద, రవినాయక్ ● జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలి: బి.వెంకటరత్నం ● ఐకమత్యమే జర్నలిస్టుల మహాబలం: కల్లోజి శ్రీనివాస్



**కొత్తగూడెం, సెప్టెంబర్ 6, (ప్రజాజ్యోతి):** తెలంగాణ ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీటీడబ్ల్యూజేఏ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. జిల్లా కేంద్రంలోని విద్యానగర్ కాలనీలోని శ్రీరామ ఫంక్షన్ హాల్ లో ఆదివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా మాళోత్ అశోక్, ప్రధాన కార్యదర్శిగా భూక్య రాము ఎన్నికయ్యారు.

టీటీడబ్ల్యూజేఏ గౌరవాధ్యక్షులు బానోత్ వీరునాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ట్రెజరర్ గా బానోత్‌రాందాస్, వైస్ ప్రెసిడెంట్ గా బదావత్ దశరథ్, గౌరవ సలహాదారుగా హాలావత్ రామారావు ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా అజ్మీరా సురేష్, బాదావత్ కోటేష్, ధరావత్ వెంకట్, బానోత్ రాము, కొర్రా శివరాం ఎన్నికయ్యారు. సభ్యులుగా కృష్ణ, రంజిత్, నాగేశ్వరావు, సైదులు, రఘురాం, బి.సురేష్, బి.రాంచందర్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

**జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి: మాళోత్ అశోక్**

జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన మాళోత్ అశోక్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న ట్రైబల్ జర్నలిస్టులను సమన్వయం చేసుకుంటూ వారి సంక్షేమం, హక్కుల సాధన కోసం కృషి చేస్తానన్నారు.

జర్నలిస్టులు ఎదుర్కొంటున్న వృత్తిపరమైన సమస్యలను సంబంధిత అధికారుల, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన అంశాలపై సంఘం తరఫున నిరంతరం పోరాడతామని చెప్పారు. యూనియన్లకు అతీతంగా జర్నలిస్టులందరినీ కలుపుకొని ఐక్యంగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు.

**జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తా: కూనంనేని**

కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేస్తానన్నారు. తాను కూడా జర్నలిస్టుగా పనిచేశానని, జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందన్నారు. జిల్లా కేంద్రంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కల్పించే అంశంపై ప్రభుత్వంతో చర్చిస్తున్నట్లు తెలిపారు.

**సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా: రాందాస్ నాయక్**

వైరా ఎమ్మెల్యే మాళోత్ రాందాస్ నాయక్ మాట్లాడుతూ జర్నలిస్టులు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా ఉంటూ ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

**ఐక్యంగా హక్కుల కోసం పోరాడాలి: మేయర్ గణేష్**

కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ మాట్లాడుతూ జర్నలిస్టులు తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాలని అన్నారు. క్లిష్ట పరిస్థితుల్లోనూ జర్నలిస్టులు విధులు నిర్వర్తిస్తున్నారని, వారి వృత్తి నిబద్ధత అభినందనీయమన్నారు. జర్నలిస్టులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.

**గిరిజన హక్కుల సాధనకు కృషి చేయాలి: సాబీర్ పాషా**

సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ .కె. సాబీర్ పాషా మాట్లాడుతూ గిరిజన జిల్లా అయిన భద్రాద్రి కొత్తగూడెంలో గిరిజనులకు రావాల్సిన హక్కుల సాధన కోసం ట్రైబల్ జర్నలిస్టులు కృషి చేయాలని అన్నారు.

గిరిజనుల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలతోపాటు వారి హక్కుల కోసం జరిగే పోరాటాలకు సీపీఐ సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు.

**సమాజాభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర కీలకం: లాల్ సింగ్**

కొత్తగూడెం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ లాల్ సింగ్ మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర కీలకమన్నారు. జర్నలిస్టులు వెలుగులోకి తీసుకొచ్చిన అనేక ప్రజా సమస్యలకు పరిష్కారం లభించిందన్నారు.

మారుతున్న మీడియా పరిస్థితుల్లో జర్నలిస్టులకు గుర్తింపు, గౌరవం దక్కాల్సిన అవసరం ఉందన్నారు.

**హక్కుల సాధనకు పోరాటాలకు సిద్ధంగా ఉండాలి: యోగినంద, రవి నాయక్**

టీయూడబ్ల్యూజే ట్రేడ్ యూనియన్–143 రాష్ట్ర ట్రెజరర్ యోగినంద, టీటీడబ్ల్యూజేఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి నాయక్ మాట్లాడుతూ జర్నలిస్టులు తమ హక్కుల సాధన కోసం పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

నూతన కమిటీకి అభినందనలు తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం, ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, ప్రత్యేక సంక్షేమ నిధి వంటి అంశాలపై ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు.

కార్యక్రమంలో ఐజేయూ జిల్లా అధ్యక్షులు బి.వెంకటరత్నం, టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు కల్లోజి శ్రీనివాస్, టీటీడబ్ల్యూజేఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు చందు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ తేజావత్ వినోద్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు మనోహర్, కార్పొరేటర్ డాక్టర్ బి.ఎస్ .రావు, టీజీటీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణ్, బంజారా సంఘాల జేఏసీ గౌరవాధ్యక్షులు రమేష్‌రాథోడ్, వైస్ చైర్మన్ ధరావత్ కాన్షీరామ్, యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు జె.బి.బాలు, సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షులు ధరావత్ సురేష్, కాంగ్రెస్ నాయకులు అర్జున్ రావు, గుగులోత్ కృష్ణ, జర్నలిస్టులు బదావత్ శంకర్, రమేష్, గణేష్, రాంబాబు, మధు, శ్రీను, రామారావు, మొక్కల బాలు తదితరులు పాల్గొన్నారు.